నమస్తే తెలంగాణ
# మెదక్
I హైదరాబాద్, శుక్రవారం 5 ఏప్రిల్ 2024 MEDAK



ఘటనా స్థలంలో పోలీసులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు



పరిశ్రమ వద్ద బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

# తమ వారేరని..

## పరిశ్రమ ఎదుట మృతుల కుటుంబీకుల ఆర్తనాదాలు

- పరిశ్రమ ఎదుట 16గంటల పాటు మృతదేహాల కోసం నిరీక్షణ
- మృతదేహాన్ని గుర్తించిన కుటుంబీకులు
- ఆరుకు చేరిన మృతుల సంఖ్య
- ఏడుగురు కార్మికుల పరిస్థితి విషమం
- సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రోడ్డుపై ధర్నా, రాస్తారోకో
- అయోమయంలో ఇతర రాష్ట్రాల కార్మిక కుటుంబాలు
- బాధితులను పరామర్శించిన హరీశ్‌రావు




1. రవిశర్మ, హైదరాబాద్
2. వడ్డేపల్లి రమేశ్, కొన్యాల, హత్నూర
3. సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్
4. సురేశ్‌పాటిల్, మధ్యప్రదేశ్
5. దయానంద్, తమిళనాడు
6. చాకలి విష్ణు, చందాపూర్, హత్నూర

హత్నూర, ఏప్రిల్ 4: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ కెమికల్ పరిశ్రమలో బుధవారం జరిగిన ప్రమాదం అనేక కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. తమవారి మృతదేహాల కోసం బాధిత కుటుంబీకులు పరిశ్రమ ఎదుట 16గంటల పాటు నిరీక్షించారు. తమ వారి మృతదేహాలను చూపించాలని వేడుకున్నా ఎవరూ స్పందించకపోవడంతో పరిశ్రమ ఎదుట బుధవారం సాయంత్రం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు ఆర్తనాదాలు చేస్తూ నిరీక్షించారు. పరిశ్రమలో జరిగిన ప్రమాద విషయం తెలుసుకోవడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశ్రమ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధిత కుటుంబీకులు మాత్రం తమవారి ఆచూకీ తెలియక బోరున విలపిస్తూ మృతదేహాల కోసం పడిగాపులు కాశారు. మృతదేహాలను ఎక్కడికి తరలించారో కూడా తెలియని పరిస్థితిలో ఇతర రాష్ట్రాల కార్మికుల కుటుంబ సభ్యులు అయోమయానికి గురయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎక్కడికి తరలించారో తెలియక ఆందోళన చెందారు. మృతదేహాలను తమకు అప్పగించాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని బాధిత కుటుంబీకులు, స్థానికులు డిమాండ్ చేస్తూ సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ధర్నాతో భారీసంఖ్యలో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పోలీసులు జోక్యం చేసుకుని బాధిత కుటుంబాలకు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. వారు వినకపోవడంతో ఓ దశలో పోలీసులు, బాధిత కుటుంబీకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు కల్పించుకుని ఆందోళనకారులను చెదరగొట్టారు.

### మృతదేహాన్ని గుర్తించిన కుటుంబీకులు

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన వడ్డేపల్లి రమేశ్ బుధవారం ఎస్బీ పరిశ్రమలో విధులకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. గురువారం పరిశ్రమలో శిథిలాల కింద రమేశ్(32) మృతదేహాన్ని కుటుంబసభ్యులు గుర్తించి బోరున విలపించారు.

### ఆరుకు చేరిన మృతుల సంఖ్య

బుధవారం ఎస్బీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో నలుగురు కార్మికులు సంఘటనా స్థలంలోనే మృతిచెందగా.. మరో కార్మికుడు దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మరో కార్మికుడి మృతదేహం పరిశ్రమ శిథిలాల కింద గురువారం లభ్యమైంది. దీంతో పరిశ్రమలో మృతిచెందిన వారిసంఖ్య ఆరుకు చేరింది. మరో ఏడుగురు కార్మికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. హైదరాబాద్‌కు చెందిన పరిశ్రమ డైరెక్టర్ రవిశర్మ, సురేశ్ పాటిల్ (మధ్యప్రదేశ్), దయానంద్ (తమిళనాడు), సుబ్రహ్మణ్యం(ఆంధ్రప్రదేశ్), చందాపూర్ గ్రామానికి చెందిన చాకలి విష్ణు బుధవారం మృతిచెందారు. గురువారం కొన్యాలకు చెందిన కార్మికుడు వడ్డేపల్లి రమేశ్ మృతదేహం లభ్యమైంది.



బుధవారం చందాపూర్‌లోని ఎస్‌బీ పరిశ్రమలో పేలిన రియాక్టర్ల వల్ల ధ్వంసమైన సామగ్రి



పరిశ్రమ ఎదుట నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న బాధిత కుటుంబీకులు, స్థానికులు

# మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

- మృతుల కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి
- క్షతగాత్రులకు రూ.25 లక్షలు చెల్లించాలి
- మంత్రుల కంటితుడుపు చర్యలతో ఉపశమనం కలగదు
- వెంటనే సాయం చేసి అండగా నిలవాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఎంఎన్ఆర్ దవాఖానలో క్షతగాత్రుల పరామర్శ



ఎంఎన్ఆర్ దవాఖానలో చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శిస్తున్న హరీశ్‌రావు

కంది, ఏప్రిల్ 4: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ గ్రామశివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ కెమికల్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం విఫలమయ్యాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ప్రమాదంలో గాయపడి ఎంఎన్ఆర్ దవాఖానలో చికిత్స పొందుతున్న కార్మికులను గురువారం ఆయన పరామర్శించారు. క్షతగాత్రులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. చందాపూర్ ఎస్‌బీ పరిశ్రమలో జరిగిన సంఘటన చాలా బాధాకరమన్నారు. ప్రమాద ఘటనపై ప్రభుత్వం వేగంగా స్పందించి ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.50లక్షలు, ప్రభుత్వ ఉద్యోగం, క్షతగాత్రులకు రూ.25లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రుల కంటితుడుపు పరామర్శలు కాకుండా వారికి తక్షణ సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. ప్రమాదంలో ఎంతమంది చనిపోయారో, ఎంతమంది గాయపడ్డారో, ఏఏ దవాఖానల్లో ఉన్నారో స్పష్టత లేదన్నారు. జిల్లాలో తరచూ రియాక్టర్లు పేలి చాలామంది కార్మికులు చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ తరఫున బాధితులకు తగిన సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. హరీశ్‌రావు వెంట జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాలను ఓదారుస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

### బాధితులను పరామర్శించిన మాజీమంత్రి హరీశ్‌రావు

ఎస్బీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబీకులను గురువారం మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. పరిశ్రమ వద్ద మృతదేహాల కోసం ఎదురుచూస్తున్న బాధిత కుటుంబీకుల వద్దకు వెళ్లి ఆయన ధైర్యం చెప్పారు. ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం బాధిత కుటుంబీకులకు ఒక్కొక్కరికీ రూ.50 లక్షలు సాయం చేయడంతో పాటు పరిశ్రమలో బాధిత కుటుంబీకులకు ఉద్యోగాలు కల్పించే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ తరఫున మృతుల కుటుంబాలకు రూ.50వేల చొప్పున ఆర్థికసాయం చేయనున్నట్లు ప్రకటించారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించడానికి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు సాయం చేస్తారని తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, చింతాప్రభాకర్, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ రావు తదితరులు ఉన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న హైదరాబాద్ జోన్ ఐజీ సుధీర్‌బాబు

### ఘటనపై సమగ్ర విచారణ: హైదరాబాద్ జోన్ ఐజీ

చందాపూర్ ఎస్‌బీ ఆర్గానిక్స్ కెమికల్ పరిశ్రమలో పేలుడు జరిగిన ప్రాంతాన్ని గురువారం హైదరాబాద్ జోన్ ఐజీ సుధీర్‌బాబు పరిశీలించారు. పరిశ్రమ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు చేశామని, డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేపడతామని ఐజీ తెలిపారు.



విరిగిన బోర్పట్ల పాఠశాల తలుపులు

# భయంగుప్పిట్లో విద్యార్థుల చదువులు

## పేలుడు ధాటికి విరిగిన పాఠశాల కిటికీలు, తలుపులు

- సమీప పరిశ్రమల రేకులు ధ్వంసం
- విధ్వంసం సృష్టించిన రియాక్టర్ల పేలుళ్లు

హత్నూర, ఏప్రిల్ 4: మండలంలోని చందాపూర్ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ కెమికల్ పరిశ్రమలో పేలుడు శబ్దానికి సమీపంలోని బోర్పట్ల ప్రభుత్వ పాఠశాల కిటికీలు, తలుపు విరిగిపడ్డాయి. బుధవారం సాయంత్రం కావడంతో పాఠశాలలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. పేలుడు శబ్దానికి పాఠశాల భవనం గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో గురువారం విద్యార్థులు భయంగుప్పిట్లో పాఠశాలకు వచ్చి తరగతి గదిలో కాకుండా చెట్లకింద కూర్చున్నారు. పలువురు విద్యార్థులు పాఠశాలకు రావడానికి భయపడుతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పరిశ్రమ సమీపంలోని పలు స్టీల్ పరిశ్రమల్లో భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు పరిశ్రమల ప్రతినిధులు తెలిపారు. పరిశ్రమల పైకప్పులతో పాటు అడ్డుగా అమర్చిన సిమెంటు రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు.



బోర్పట్ల ప్రభుత్వ పాఠశాలలో చెట్లకింద కూర్చున్న విద్యార్థులు

# రూ.41లక్షల చొప్పున ఆర్థికసాయం

హత్నూర, ఏప్రిల్ 4: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ కెమికల్ పరిశ్రమలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేయడానికి పరిశ్రమ యాజమాన్యం ఒప్పుకున్నట్లు టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ సంగారెడ్డిలో పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరుపగా.. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.41లక్షల చొప్పున నాలుగు కుటుంబాలకు చెల్లించడానికి పరిశ్రమ యాజమాన్యం ఒప్పుకున్నట్లు తెలిపారు. తక్షణ సాయంగా రూ.లక్ష చొప్పున చెల్లించినట్లు తెలిపారు.



బాధిత కుటుంబీకులను ఓదారుస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ

# బెజ్జంకి క్రాసింగ్ వద్ద రైతులతో మాట్లాడనున్న కేసీఆర్

బెజ్జంకి, ఏప్రిల్ 4: తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని క్రాసింగ్ వద్ద ఎండిన పంటలను శుక్రవారం పరిశీలించనున్నారు. నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పెద్దఎత్తున బెజ్జంకి క్రాసింగ్‌కు తరలిరానున్నారు. మండలంలో చాలా ఎకరాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోయాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడ్డా పొలాలు పూర్తిగా ఎండిపోయాయి. పెట్టిన పెట్టుబడి రాక రైతులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా మండుటెండల్లో సైతం గోదావరి జలాలను తెచ్చి చెరువులు, కుంటలను నింపి పంటలను కాపాడింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం పంటలు ఎండుతున్నా కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి బెజ్జంకి మండలానికి సాగునీరు అందిస్తే రైతుల పంటలు దక్కేవి. కానీ, ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో పంటలు ఎండిపోయి రైతులు పుట్టెడు దు:ఖంలో ఉన్నారు. కేసీఆర్ కరీంనగర్ జిల్లాకు వెళ్తూ బెజ్జంకి క్రాసింగ్ వద్ద ఎండిన పంటలను పరిశీలించి రైతులను ఓదార్చనున్నారు.



నర్సింహులపల్లి శివారులో ఎండిన వరిని మేస్తున్న పశువులు

# మనుషులు కలిసినా.. ఎన్నికల్లో కలిసి పనిచేసేనా!

చర్చనీయాంశంగా నీలం మధు, కాటా శ్రీనివాస్ వ్యవహారం

- మంత్రి సురేఖ ఎదుటే నీలం మధుపై కాటా భార్య ఫైర్
- చెంప పగులగొట్టాలి అనుకున్నా.. నాభర్త గురించి నోటికొచ్చినట్లు మాట్లాడిండు అని వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో కాటా సుధారాణి వీడియో వైరల్



సంగారెడ్డి, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ): మెదక్ ఎంపీ టికెట్ కేటాయింపుతో కాంగ్రెస్‌లో మొదలైన రచ్చ అంతకంతకూ పెరుగుతూనే ఉన్నది. మెదక్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్‌ను గెలిపించాలని పట్టుదలగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అందరూ నాయకులను ఏకతాటి మీదికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. సీఎం ప్రయత్నాలు కలిసి రాకపోగా బెడిసి కొడుతున్నట్లు కనిపిస్తోంది. మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, పటాన్‌చెరు కాంగ్రెస్ నేత కాటా శ్రీనివాస్‌గౌడ్ ఇద్దరినీ కలపాలన్న రేవంత్‌రెడ్డి వ్యూహం ఫలించే సూచనలు కనిపించడం లేదు. సీఎం ఒత్తిడి మేరకు కాటా శ్రీనివాస్‌గౌడ్ తప్పనిసరి పరిస్థితుల్లో నీలం మధును కలిశారు. ఎన్నికల్లో కలిసి పనిచేస్తానని హామీ ఇచ్చారు. వాస్తవంగా కాటా శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఆయన మద్దతుదారులు నీలం మధుతో కలిసి ఎంపీ ఎన్నికల్లో పనిచేసే అవకాశాలు కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నీలం మధు, కాటా శ్రీనివాస్‌గౌడ్ మధ్య పొరపొచ్చాలు నెలకొనడమే ఇందుకు ప్రధాన కారణం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాటా శ్రీనివాస్‌గౌడ్‌ను కాదని కాంగ్రెస్ అధిష్టానం బీఆర్ఎస్ నుంచి వచ్చిన నీలం మధుకు పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ఇది నచ్చని కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆందోళనకు దిగారు. అప్పట్లో ఆయన భార్య కాటా సుధారాణి కాంగ్రెస్ అధిష్టానం, నీలం మధుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విడుదల చేసిన వీడియో సంచలనం రేపింది. కాంగ్రెస్ సీనియర్ నేత దామోదర రాజనర్సింహ ఒత్తిడితో కాంగ్రెస్ అధిష్టానం తన నిర్ణయాన్ని మార్చుకుని తిరిగి ఎమ్మెల్యే టికెట్‌ను కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు కేటాయించింది. తనకు ప్రకటించిన ఎమ్మెల్యే టికెట్ దక్కకుండా చేసిన కాటా శ్రీనివాస్‌గౌడ్‌ను ఎన్నికల్లో ఓడించి తాను గెలుస్తానని నీలం మధు సవాలు చేశారు. కాంగ్రెస్ నుంచి కాటా శ్రీనివాస్‌గౌడ్ పోటీచేస్తే నీలం మధు బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా పోటీకి దిగారు. నామినేషన్లు వేసింది మొదలు ఎన్నికల ప్రచారం ముగిసే వరకు ఇద్దరు పరస్పరం వ్యక్తిగత దూషణలకు దిగారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు ఓటమి పాలైనప్పటికీ ఇద్దరి మధ్య వైరం కొనసాగుతూనే ఉంది. కాగా, ఎంపీ ఎన్నికలకు ముందు నీలం మధు తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అధిష్టానం సీనియర్లను పక్కనబెట్టి నీలం మధుకు మెదక్ ఎంపీ టికెట్ ఇచ్చింది. ఇది పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు మింగుడు పడలేదు. తన ఓటమికి కారణమైన వ్యక్తికి ఎంపీ టికెట్ ఇస్తారా అని ఆగ్రహంతో ఉన్న ఆయన మధుతో కలిసి పని చేసేందుకు ససేమిరా అన్నారు. దీంతో స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి కలుగజేసుకుని రెండు రోజుల క్రితం ఇద్దరినీ కలిపారు.

### కొండా సురేఖ ఎదుటే కలిసి పనిచేసేందుకు నిరాకరణ

మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, మంత్రి కొండా సురేఖ ఎదుటే నీలం మధుతో కలిసి పనిచేసేందుకు కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆయన మద్దతుదారులు విముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తున్నది. బుధవారం నీలం మధును వెంటబెట్టుకుని మంత్రి కొండా సురేఖ రామచంద్రాపురంలోని కాటా శ్రీనివాస్‌గౌడ్ ఇంటికి వచ్చింది. ఈ సందర్భంగా నీలం మధు, కాటా శ్రీనివాగౌడ్ ఇద్దరినీ కలిసి పనిచేయాల్సిందిగా మంత్రి నచ్చజెప్పారు. సీఎం ఒత్తిడి మేరకు నీలం మధుతో చేతులు కలిపినప్పటికీ కాటా శ్రీనివాస్‌గౌడ్ మాత్రం తాను ఎన్నికల్లో పనిచేయలేనని కొండా సురేఖకు ప్రైవేటుగా చెప్పినట్లు తెలుస్తుంది. తనను వ్యక్తిగతంగా దూషించి తన ఓటమికి కారణమైన నీలం మధుతో కలిసి పని చేసేది లేదని, తన మద్దతుదారులు సైతం ఒప్పుకోవడం లేదని కాటా శ్రీనివాస్‌గౌడ్ మంత్రి సురేఖకు వివరించినట్లు తెలుస్తుంది. కాటా శ్రీనివాస్‌గౌడ్ భార్య సైతం మంత్రి సురేఖ ఎదుట ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో గురువారం వైరల్ అయ్యింది. కాటా శ్రీనివాస్‌గౌడ్ భార్య కాటా సుధారాణి నీలం మధుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'నా భర్తను ఎన్నికల సమయంలో వ్యక్తిగతంగా దూషించాడు.. అనరాని మాటలు అన్నాడు.. ఇప్పుడు ఎలా క్షమించి పనిచేస్తాము.. మీరు ఏమి అనుకోకండా ఆయన అన్న మాటలకు చెంప పగులగొట్టాలని ఉంది అన్నారు'. ఈ వీడియో వైరల్ కావడంతో పాటు కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాటా శ్రీనివాస్‌గౌడ్ మద్దతుదారులు ఎన్నికల్లో మనస్ఫూర్తిగా పనిచేసే అవకాశాలు కనిపించడం లేదు. కాగా, కాటా సుధారాణి సైతం మంత్రి సురేఖ వినతి మేరకు నీలం మధును క్షమించి బొట్టుపెట్టి దీవించిందని నీలం మధు మద్దతుదారులు తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు కాటా సుధారాణి బొట్టుపెడుతున్న వీడియోను సోషల్ మీడియాలో వాళ్లు పోస్టు చేశారు.



# బీఆర్ఎస్‌ను వీడను

- జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, ఏప్రిల్ 4: బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరుతున్నానని తీన్మార్ మల్లన్న తప్పుడు వార్తను ప్రసారం చేశారని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. 12మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, అందులో తన పేరు రాశారని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు వార్తలు రాసే వారిపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. గురువారం నియోజకవర్గంలో పలు శుభ కార్యాలకు హాజరయ్యానని వివరించారు. జహీరాబాద్ వదిలి పోలేదని, తీన్మార్ మల్లన్న మాత్రం ఇలాంటి తప్పుడు కథనాలు ప్రసారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయాల్లో ఉన్నన్ని రోజులు, చివరి వరకు బీఆర్ఎస్‌తోనే ఉంటానని స్పష్టం చేశారు.